క్లుప్తంగా

ఆహారం బట్టే ఆరోగ్యం



పౌష్టికాహార మాసోత్సవాల ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని తిమ్మరాజుపేట ఎలిమెంటరీ పాఠశాల ఆవరణలో సోమవారం పోషకాహార మాసోత్సవాలను పురస్కరించుకొని అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ వాహిని ఫౌండేషన్ బ్లాక్ కో–ఆర్డినేటర్ హారిక మాట్లాడుతూ చిన్నారులకు తాజా కూర గాయాలతో ఆహారాన్ని అందించాలని సూచించారు. చిరుతిండ్లు తినకుండా జాగ్రత్త పడాలని అన్నారు. తీసుకొనే ఆహారమే ఆరోగ్యానికి కీలకం అని వ్యాఖ్యానించారు. సర్పంచ్ శరగడం భాగ్యలక్ష్మి, శివ బాపునాయుడు, జయలక్ష్మి, వెంకటలక్ష్మి, సంతోషి పాల్గొన్నారు.

ఘనంగా కృష్ణుని రాట మహోత్సవం



నారాయుడుపాలెం మెట్టపై రాట వేస్తున్న దృశ్యం

మునగపాక: మండలంలోని నారాయుడు పాలెం మెట్టపై సోమవారం కృష్ణునిరాట మహోత్సవం ఘనంగా నిర్వహించారు. శ్రీ కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా మహిళలు, గ్రామస్తులు రాట మహోత్సవాన్ని భక్తి శ్రద్ధలతో జరుపుకొన్నారు. కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఇరువర్గాల వివాదంపై డీఎస్పీ విచారణ



పల్లపు ఆనందపురంలో కేసు విచారణ చేస్తున్న డీఎస్పీ సత్యనారాయణ

మునగపాక : మండలంలోని పల్లపు ఆనందపురంలో సోమవారం మధ్యాహ్నం పరవాడ డీఎస్పీ సత్యనారాయణ పర్యటించారు. ఇటీవల గ్రామంలో రెండు వర్గాల మధ్య జరిగిన వివాదానికి సంబంధించి కేసు నమోదైన నేపథ్యంలో ఆయన సచివాలయంలో విచారణ చేపట్టారు. కేసు విచారణకు రెండు వర్గాలు సహకరించాలన్నారు. వివాదాలకు తావులేకుండా ప్రతి ఒక్కరూ సోదరభావంతో మెలగాలన్నారు. ఆయన వెంట మునగపాక ఎస్‌ఐ మహమ్మద్ అలీ షరీఫ్ ఉన్నారు.

ఉప సర్పంచ్‌గా శ్రీనివాసరావు



ప్రమాణ స్వీకారం చేస్తున్న శ్రీనివాసరావు

కోటవురట్ల : కె.వెంకటాపురం గ్రామ పంచాయతీలో ఉప సర్పంచ్‌గా గొల్లు శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గత నెల 28వ తేదీన ఉప సర్పంచ్ రామకృష్ణ అనారోగ్య కారణాలతో రాజీనామా చేయగా ఉన్నతాధికారుల ఆదేశాలతో సోమవారం ఎన్నిక ప్రక్రియ నిర్వహించారు. ఎన్నికల అధికారిగా మూర్తి వ్యవహరించగా 11 మంది వార్డు సభ్యులు వైఎస్సార్‌సీపీ మద్దతుదారుడు శ్రీనివాసరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారి మూర్తి ప్రమాణస్వీకారం చేయించి ధ్రువపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు పైల రమేష్, సర్పంచ్ పైల శ్రీదేవి మంగా ఇందిర భవానీ, ఎంపీటీసీ కాళ్ల రత్నం, ఈవోపీఆర్డీ సుబ్రహ్మణ్యం, పార్టీ నాయకులు గొల్లు చిట్టిబాబు, పైల నాని పాల్గొన్నారు.

'పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలి'

కోటవురట్ల: పెరిగిన నిత్యవసర సరుకుల ధరలు, విద్యుత్ చార్జీలను తగ్గించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. తహసీల్దారు కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన నిర్వహించారు. సీపీఎం నాయకులు వెంకటస్వామి, డేవిడ్‌రాజ్ మాట్లాడుతూ గ్యాస్ సిలిండర్‌ను రూ.450కే అందించాలని, ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా ఇవ్వాలని, విద్యుత్ సర్దుబాటు ఛార్జీలు రద్దు చేయాలని, ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

తొలగిన ప'రేషన్'

రేషన్ కార్డు.. బడుగు, బలహీన వర్గాల ప్రజలకు భరోసా. ఒకప్పుడు రేషన్ కార్డు కావాలంటే ఆ తిప్పలు చెప్పనలవి కానివి. ఎప్పుడో తప్ప.. రేషన్ కార్డుకు దరఖాస్తు చేసుకునే వెసులుబాటు ఉండేది కాదు. గత ప్రభుత్వం లోనైతే మరీ దారుణం. జననేత జగన్ పాలనలో ప్రజల ప్రతి అవసరం వారి ఇంటి ముంగిటే నెరవేరుతోంది. ఇపుడు రేషన్ కార్డుల జారీ కూడా వలంటీర్ వ్యవస్థ ద్వారా సచివాలయంలోనే అందించనుంది. ఇక మీదట ఎప్పుడైనా.. దరఖాస్తు చేసుకోవచ్చు.



రేషన్ సరకుల్ని ఇళ్ల వద్దే అందిస్తున్న ఎండీయూ వాహనం(ఇన్‌సెట్) రేషన్ కార్డు కోసం దరఖాస్తుదారుల ఇంటికి వెళ్లి వివరాలు సేకరిస్తున్న వలంటీర్

- సచివాలయాల ద్వారా రేషన్ కార్డులకు దరఖాస్తులు
- నిరంతర కార్డుల మంజూరుకు ప్రభుత్వం చర్యలు
- అనకాపల్లి డివిజన్‌లో కొత్తగా 3,986 రేషన్ కార్డులు

అనకాపల్లి రూరల్: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మరిన్ని అవసరాలు తీర్చేందుకు చర్యలు తీసుకుంది. సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలు అందిస్తోంది. దీనిలో భాగంగా రేషన్(బియ్యం) కార్డుల జారీని మరింత సులభతరం చేసి అర్హులందరికీ మంజూరు చేసేలా ఏర్పాట్లు చేసింది. పేద కుటుంబాలకు జీవనాధారమైన రేషన్ కార్డుల జారీని నిరంతర ప్రక్రియగా మార్చింది. గతంలో ప్రజాప్రతినిధులు, అధికారపార్టీ నాయకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తే తప్ప రేషన్ కార్డులు మంజూరయ్యేవి కావు. ఈ అవస్థలకు చెక్ పెడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అర్హతే ప్రామాణికంగా బియ్యం కార్డుల జారీకి చర్యలు తీసుకుంది.

మండలాల వారీగా మంజూరైన రేషన్ కార్డులు

మండలం	కొత్త కార్డులు
అనకాపల్లి	758
కశింకోట	288
మునగపాక	256
బుచ్చెయ్యపేట	277
సబ్బవరం	280
కె కోటపాడు	271
చోడవరం	395
దేవరాపల్లి	283
అచ్యుతాపురం	345
రాంబిల్లి	285
పరవాడ	234
యలమంచిలి	314
మొత్తం	3986

వలంటీర్ల ద్వారా గుర్తింపు

వలంటీర్ల ద్వారా అర్హులను గుర్తిస్తూ కార్డులను నేరుగా లబ్ధిదారులకు అందించేలా ప్రభుత్వం కొత్త విధానాన్ని అమల్లోకి తెచ్చింది. తాజాగా అనకాపల్లి రెవెన్యూ డివిజన్‌లో 3,986 కొత్త రేషన్ కార్డులను మంజూరు చేసింది. వీరందరికీ ఈ నెల ఒకటో తేదీ నుంచి రేషన్ సరకులు అందించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇప్పటి వరకు 6 నెలలకు ఒకసారి రేషన్ కార్డులు అందిస్తున్న ప్రభుత్వం తాజాగా రేషన్ కార్డుల కోసం దరఖాస్తులను సచివాలయాల్లో నిరంతరాయంగా స్వీకరించాలని ఆదేశించారు. దరఖాస్తులు స్వీకరించిన అనంతరం ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసి, ఆరు నెలల్లోపు అర్హులను గుర్తించి వారికి రేషన్ కార్డులు మంజూరు చేసేలా చర్యలు తీసుకుంది. దీనిపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

అర్హత ఉంటే రేషన్ కార్డు



అర్హత ఉన్న కుటుంబాలకు రేషన్ కార్డులు మంజూరు చేసే ప్రక్రియ నిరంతరాయంగా చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నిర్ణయం నిరుపేదలకు మేలు చేస్తుంది. రేషన్ కార్డుల కోసం దరఖాస్తుల స్వీకరణ నిరంతర ప్రక్రియగా కొనసాగుతుంది. గతంలో కంటే సులభంగా, పారదర్శకంగా కార్డుల జారీకి ప్రభుత్వ నిర్ణయం దోహదపడుతుంది. అర్హులందరికీ రేషన్ కార్డులు మంజూరవుతాయి.

– ఏజీ చిన్నికృష్ణ, ఆర్డీవో, అనకాపల్లి

పేదల కష్టాలు తీర్చింది..జగనన్న ఒక్కరే



ఎస్.రాయవరం గడప గడపకూ మనప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

ఎస్.రాయవరం : మండల కేంద్రంలో మూడో రోజు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం ఎమ్మెల్యే గొల్ల బాబూరావు నిర్వహించారు. పలు గృహాలను సందర్శించి ప్రభుత్వ పథకాలు అందుకున్న వారితో మాట్లాడారు. పేదవాడికి సంక్షేమం అందించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరేనని, మళ్లీ జగన్ బాబే సీఎంగా రావాలని కోరుకుంటున్నామని పలువురు ఎమ్మెల్యేకు తెలిపారు. స్థానికంగా నెలకొన్న సమస్యలు పూర్తి స్థాయిలో పరిష్కరించాలని అధికారులను ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ కోనలక్ష్మి, జెడ్పీటీసీ కాకర దేవి, వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు, సర్పంచ్‌ల సంఘ అధ్యక్షులు కర్రి సత్యనారాయణ, సర్పంచ్‌లు దూళి శ్రీనుబాబు, శానాపతి శ్రీరాములు,పాలపర్తి పాపారావు, భూపతి అప్పారావు, కొప్పిశెట్టి సత్యం, మాజీ సర్పంచి లక్కోజు ఆదిమూర్తి, మరిశారమణబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు గొంతిన సత్యనారాయణ, వియ్యపు సింహాద్రి యాదవ్, ఎంపీడీవో రామచంద్రమూర్తి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కూడా 'గడప గడపకు'

మండల కేంద్రంలో నాలుగవ రోజు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో రామచంద్రమూర్తి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గొల్ల బాబూరావు హాజరు అవుతారన్నారు. సచివాలయ సిబ్బంది, మండల అధికారులు సకాలంలో హాజరు కావాలని సూచించారు.

అర్హత ఉన్న అందరికీ పింఛన్లు



కొరుప్రోలు క్యాంపు కార్యాలయం వద్ద పింఛన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

ఎస్.రాయవరం : అర్హత ఉన్నవారందని ప్రభుత్వ పథకాలు అందజేయడమే సీఎం జగన్ మోహన్‌రెడ్డి లక్ష్యమని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు.మండలంలో నూతనం మంజూరయిన పింఛన్లు లబ్ధిదారులకు అందజేశారు. మండల కేంద్రంలో 240 మందికి, కొరుప్రోలు క్యాంపు కార్యాలయంలో 140 మందికి పింఛను నగదు ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇంత పెద్ద ఎత్తున నగదు ఎవరు మంజూరు చేశారనే గుర్తుంచుకోవాలని, ఎన్నికల ముందు చెప్పిన విధంగా రెండు వేల రూపాయలు రావడానికి కారణమయిన సీఎం జగన్, అధికారం వచ్చాక అంచెలంచెలుగా పింఛన్ పెంచారన్నారు. వచ్చే జనవరి నుంచి రూ 3 వేలు పింఛనుదారులకు అందనుందని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కొణతాల శ్రీనివాసరావు, బొలిశెట్టి గోవిందు, దత్తుడు సీతబాబు, సర్పంచ్‌లు భూపతి అప్పారావు,చీకట్ల జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవా నిరతి



కిమ్స్ ఆస్పత్రిలో లక్ష్మికి పింఛను అందజేస్తున్న వలంటీర్ సాయిలక్ష్మి



అనారోగ్యంతో బాధపడుతున్న సన్యాసిరావుకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ భారతి

మునగపాక : పలువురు వలంటీర్లు తమ సేవా గుణాన్ని చాటుకుంటూ అందరి మన్ననలు అందుకుంటున్నారు. నాగులాపల్లి గ్రామానికి చెందిన పేలూరి సన్యాసిరావు అనారోగ్యంతో బాధపడుతూ ఏడాది కాలంగా అనకాపల్లి మండలం రేబాకలో ఉంటున్నారు. సెప్టెంబర్ నెలకు సంబంధించిన పింఛన్ సొమ్మును సంబంధిత వలంటీర్ డొక్కా భారతి ఆయనకు సోమవారం అందజేశారు. తోటాడకు చెందిన అంగులూరి పద్మ విశాఖ సెవెన్స్ హిల్స్‌లో గుండె ఆపరేషన్ చేయించుకోవడంతో సంబంధిత వలంటీర్ ద్రాక్షారపు శిరీష విశాఖ వెళ్లి పింఛన్ సొమ్ము అందజేశారు.వలంటీర్లు అందిస్తున్న సేవలకు ఆయా గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రాంబిల్లి : మామిడివాడలో వలంటీర్ నందవరపు సాయిలక్ష్మి విశాఖ కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఎం.లక్ష్మికి పింఛను అందించి సేవా నిరతి చాటుకున్నారు. హార్ట్ సర్జరీ చేయించుకొని లక్ష్మి కిమ్స్‌లో చికిత్స పొందుతుంది. దీంతో ఆమెకు విశాఖపట్నం వెళ్లి వలంటీర్ పింఛను అందజేశారు.

నలుగురు ఉపాధ్యాయులకు జిల్లా స్థాయి పురస్కారాలు



అప్పలరాజు



భవాని



సత్యనారాయణ



వనజ

నక్కపల్లి : మండలంలో పనిచేస్తున్న నలుగురు ఉపాధ్యాయులు జిల్లా స్థాయి పురస్కారాలకు ఎంపికయ్యారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ పాఠశాలల్లో పనిచేస్తున్న వీరిని జిల్లా స్థాయి అవార్డులకు ఎంపిక చేశారని ఎంఈవో కుంచం నరేష్ తెలిపారు. ఆంగ్ల మాధ్యమంలో సృజనాత్మక బోధనా విధానం, పిల్లల్లో ఆంగ్లంపై ఆసక్తిని పెంపొందించి మంచి ఫలితాలు సాధించినందుకు పురస్కారాలకు ఎంపిక చేసినట్టు తెలిపారు. మనబాన వానిపాలెం పాఠశాల ఉపాధ్యాయుడు చొక్కా అప్పలరాజు, నక్కపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల సోషల్ టీచర్ సిహెచ్. భవానీ, చుక్కలవాని లక్ష్మీపురం హెచ్‌ఎం చుక్కల సత్యనారాయణ, జెడ్పీ ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయిని కోరాడ వనజ జిల్లా స్థాయి పురస్కారాలకు ఎంపికయ్యారు. వారిని ఎంఈవో కె.నరేష్‌తో పాటు ఉపాధ్యాయ సంఘ నేతలు కొండలరావు, ఏడిదకృష్ణ, రంగబాబు, రాజేష్, ఫల్గుణరావు, జగదీష్, ఎస్‌వీఎస్ ఆచార్యులు అభినందించారు.

మునగపాక మండలంలో...

మునగపాక : మండలంలోని నలుగురు ఉపాధ్యాయులు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. తోటాడ జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్‌ఎం బర్రి కుమార్, నాగులాపల్లి జెడ్పీ హైస్కూల్‌కు చెందిన స్కూల్ అసిస్టెంట్ (మ్యాథ్స్) బొంగిరి రామకృష్ణ, వాడ్రాపల్లి జెడ్పీ హైస్కూల్ స్కూల్ అసిస్టెంట్ (మ్యాథ్స్) బుద్ద రామప్పారావు, వాడ్రాపల్లి ఎంపీపీ స్కూల్‌కు చెందిన సెకెండరీ గ్రేడ్ టీచర్ కేవీఎస్ సత్యనారాయణ ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. మంగళవారం అనకాపల్లిలో వారికి పురస్కారాలు అందజేస్తారని ఎంఈవో వేణుగోపాలరావు తెలిపారు.

బళ్ల కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి



తహసీల్దారు రాణీ అమ్మాజీకి వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు కర్రి అప్పారావు

యలమంచిలి : ఈడ్పు బళ్ల కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం సీనియర్ నాయకుడు కర్రి అప్పారావు అన్నారు. సోమవారం యలమంచిలిలో ఈడ్పు బళ్ల కార్మికుల సమస్యలపై తహసీల్దారు రాణీ అమ్మాజీకి సీపీఎం నాయకుల ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలో సుమారు 50 మంది బళ్ల కార్మికులు జీవనం సాగిస్తున్నారని, వీరంతా దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం డ్రైవర్లకు, రజకులకు, నాయీబ్రాహ్మణులకు రూ.10 వేలు అందిస్తుందని, వీరికి కూడా ప్రభుత్వం రూ.10 వేలు అందించి ఆదుకోవాలన్నారు. అనంతరం కార్మికులతో కలసి తహసీల్దార్ రాణీ అమ్మాజీకి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నగిరెడ్డి సత్యనారాయణ, గారబోయిన రాజు, కొఠారు నాగసత్యనారాయణ, నగిరెడ్డి హోమ్ బాబు, దిగుమర్తి అప్పారావు పాల్గొన్నారు.

రాజీమార్గమే రాజమార్గం

- సీనియర్ సివిల్ జడ్జి సాయికుమారి
- 9వ తేదీన లోక్ అదాలత్

యలమంచిలి : రాజీ మార్గమే రాజమార్గమని యలమంచిలి సీనియర్ సివిల్ జడ్జి (మండల న్యాయ సేవాసంస్థ అధ్యక్షులు) ఎ. సాయికుమారి అన్నారు. ఆమె మాట్లాడుతూ ఈనెల 9వ తేదీన జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా యలమంచిలి కోర్టులో జరిగే సదస్సులో కక్షిదారులు తమ కేసులను రాజీ చేసుకుని సమస్యలను పరిష్కరించుకోవాలని అన్నారు. క్రిమినల్ కేసులు, కుటుంబ తగాదాలు, ప్రిలిటిగేషన్ కేసులు, బ్యాంకు అప్పు, ఇంటి పన్ను బకాయిలు, టెలిఫోన్ బకాయిలు తదితర కేసులకు సంబంధించి తగాదాలను పరిష్కరించుకోవాలని, కోర్టులో కట్టిన ఫీజులను తిరిగి వాపసు తీసుకునే అవకాశం కూడా ఈ లోక్ అదాలత్‌లో పొందవచ్చని తెలిపారు. కక్షిదారులందరూ రాజీమార్గాన్ని అనుసరించాలని, డబ్బులు, సమయం వృధా చేసుకోకుండా న్యాయం పొందాలని సూచించారు.

నేవీ నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి

రాంబిల్లి: కేంద్ర పభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను విడనాడాలని సీపీఎం మండల కార్యదర్శి దేముడునాయుడు డిమాండ్ చేశారు. నేవీ నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని, గ్రామాల్లో విషజ్వరాలను అదుపు చేయాలని కోరుతూ తహసీల్దార్ పి.భాగ్యవతికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో శివాజీ, అప్పలరాజు పాల్గొన్నారు.

సీపీఎం ఇంటింటా ప్రచారం

మునగపాక : కేంద్ర ప్రభుత్వ విధానాలకు నిరసనగా సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఎన్నికల హామీలను విస్మరించిన కేంద్ర ప్రభుత్వానికి రానున్న రోజుల్లో గుణపాఠం చెప్పాలని సీపీఎం నేతలు ఆళ్ల మహేశ్వరరావు, వీవీ శ్రీనివాసరావు, బ్రహ్మాజీలు అన్నారు.

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయని ఆరోపించారు.

కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్

మునగపాక : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి సీఎం కావడం తథ్యమని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ అన్నారు. మునగపాక బొడ్డేడ క్యాంపు కార్యాలయంలో సోమవారం రాత్రి మునగపాక మండల కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూరుతుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయం, వలంటీర్ వ్యవస్థలు అందుబాటులోకి రావడం ద్వారా ప్రజలకు సకాలంలో సేవలందుతున్నాయన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం, అలాగే జగనన్న సురక్ష కార్యక్రమాల ద్వారా ప్రజా సమస్యలు పరిష్కారమయ్యాయన్నారు. జగన్‌మోహన్‌రెడ్డిని ఓడించేందుకు ప్రతిపక్షాలు ఏకమవుతున్నాయన్నారు. ప్రజలంతా జగన్‌మోహన్‌రెడ్డి వైపే ఉన్నారన్నారు. డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా కృషి చేయాలన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలుతో పాటు అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్ సారధ్యంలో జిల్లాలోని 7 శాసనసభ స్థానాలను వైఎస్సార్‌సీపీ కైవసం చేసుకుంటుందన్నారు. పార్టీ సీనియర్ నాయకులు వేగి కృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సర్పంచ్ దిమ్మల అప్పారావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి రామ్మోహనరావు, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పిల్లి కనకలక్ష్మి అప్పారావు, ఎంపీటీసీలు సూరిశెట్టి రాము, సచివాలయ మండల కన్వీనర్ పాలిమేర గణేష్, పార్టీ అధికార ప్రతినిధి ఆడారి కాశీబాబు, పంచాయతీ వార్డు సభ్యులతోపాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం మునగపాక దళితవాడలోని పాఠశాల అభివృద్ధికి కంపెనీ సమకూర్చిన రూ.2లక్షల చెక్కును పాఠశాల కమిటీ సభ్యులకు అందజేశారు.

11 మందికి కొత్త పింఛన్ల పంపిణీ



కె.వెంకటాపురంలో పింఛను అందిస్తున్న ఉప సర్పంచ్



ఒంపోలులో కొత్త పింఛన్‌లు అందజేస్తున్న దృశ్యం

కోటవురట్ల: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అర్హతే కొలమానంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు పైల రమేష్ అన్నారు. కె.వెంకటాపురంలో కొత్తగా మంజూరైన పింఛన్లను సోమవారం పంపిణీ చేశారు. తమ గ్రామంలో 11 మందికి కొత్తగా పింఛన్లు మంజూరయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కాళ్ల రత్నం, ఉప సర్పంచ్ గొల్లు శ్రీనివాసరావు, పార్టీ నాయకులు గొల్లు చిట్టిబాబు, పైల శ్రీరామ్మూర్తి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఒంపోలులో కొత్త పింఛన్ల పంపిణీ

మునగపాక : అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్‌లు మంజూరు చేస్తున్నామని ఒంపోలు సచివాలయ కన్వీనర్ నరాలశెట్టి సూర్యనారాయణ పేర్కొన్నారు. మండలంలోని ఒంపోలు సచివాలయంలో నూతనంగా మంజూరైన పింఛన్‌లను ఆయన సోమవారం అందజేశారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సూరిబాబు, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి బొడ్డపు శ్రీరామమూర్తి, మండల ప్రధాన కార్యదర్శి ద్వారం జానకీరామ్, పాలసంఘ మాజీ అధ్యక్షుడు నరాలశెట్టి తాతారావు పాల్గొన్నారు.

శ్రీప్రకాష్‌లో గురుపూజోత్సవాలు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కంటిపూడి నరేంద్రబాబు

పాయకరావుపేట : శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల్లో గురుపూజోత్సవాలను ప్రకాష్ విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సిహెచ్.విజయ్ ప్రకాష్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ వేడుకలు రెండు రోజుల పాటు జరగనున్నాయి. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో సీనియర్ ప్రిన్సిపాల్ ఎం.వి.వి.ఎస్ మూర్తి మోడరేటర్‌గా 'ఉపాధ్యాయుల బోధన ద్వారా విద్యార్థి అభ్యసన సులభతరమా, లేక సహచర విద్యార్థుల ద్వారా నేర్చుకోవడం సులభతరమా' అనే అంశం పైన జరిగిన చర్చా వేదికలో ఉపాధ్యాయులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. ముఖ్య అతిథి శ్రీ ప్రకాష్ ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రెసిడెంట్ డాక్టర్ కంటిపూడి నరేంద్రబాబు మాట్లాడుతూ ఉపాధ్యాయుడు నిరంతర విద్యార్థిగా అన్ని విషయాలు నేర్చుకోవాలని, విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. సంయుక్త కార్యదర్శి విజయ్ ప్రకాష్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు తరగతి గదిలో జరిగే బోధనతో పాటు, వివిధ పోటీ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయాలన్నారు. అనంతరం ఉపాధ్యాయుల బృందగానం, నాటికల పోటీలు నిర్వహించారు.

వాహనాల కొనుగోలుకు రైతులకు రుణ సదుపాయం



రైతుల సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ రాజేష్ ఖన్నా

పాయకరావుపేట : సంఘ సభ్యులకు వాహనాల కొనుగోలుకు త్వరలో రుణ సదుపాయం కల్పించడం జరుగుతుందని పాయకరావుపేట పీఏసీఎస్ చైర్మన్ దేవవరపు రాజేష్ ఖన్నా అన్నారు. సంఘ కార్యాలయంలో సోమవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంఘంలో రైతులకు అతి తక్కువ వడ్డీకే బంగారు ఆభరణాలపై రుణాలు ఇస్తున్నామని, పంట అప్పులు, భూమి తనఖా అప్పులు విరివిగా అందజేస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు రూ.11 కోట్లు రుణాలు మంజూరు చేయడం జరిగిందన్నారు. సన్న, చిన్నకారు రైతులను ఆర్థికంగా ఆదుకోవడానికి సంఘం సిద్ధంగా వుందన్నారు. సమావేశంలో పీఏసీఎస్ సిఈవో పి.నాగభూషణం, పాల్మన్‌పేట సర్పంచ్ కోడ కోటేశ్వరరావు, పాల్తేరు మాజీ సర్పంచ్ దేవవరపు వెంకటేశ్వరరావు, మంగవరం మాజీ సర్పంచ్ ఆనంద్ కుమార్, పీఏసీఎస్ డైరెక్టర్లు దేవవరపు శ్రీనివాసరావు, అల్లు చంటిబాబు, సంఘ సభ్యులు పెనుమత్స నాగేశ్వరరావు, కోలా మాణిక్యాలరావు, కట్టా అప్పారావు పాల్గొన్నారు.

న్యాయం చేయాలంటూ స్థల బాధితుల వినతి

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని వెదురువాడ పరిధిలో తాము కొనుగోలు చేసిన స్థలాన్ని వేరొకరు వచ్చి తమదంటూ గొడవలు పెడుతున్నారని ఈ విషయంలో న్యాయం చేయాలంటూ పలువురు బాధితులు సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. డీటీకి వినతి పత్రం అందజేశారు. ఈ విషయంలో దర్యాప్తు జరిపి స్థలం కొనుగోలు చేసిన వారికి న్యాయం చేయాలని వారు రెవెన్యూ అధికారులను కోరారు.

స్వచ్ఛ సంకల్పంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి



కె.వెంకటాపురంలోని డ్రైనేజీలో పూడిక తీస్తున్న రమేష్

కోటవురట్ల : గ్రామాన్ని స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దుకునేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించాలని జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు పైల రమేష్ పిలుపునిచ్చారు. కె.వెంకటాపురంలో సోమవారం పారిశుధ్య పనులు నిర్వహించారు. పనులను పరిశీలించిన రమేష్ తానే నేరుగా మెయిన్‌రోడ్డులోని డ్రైనేజీలో పేరుకుపోయిన పూడికను తొలగించారు. రమేష్ మాట్లాడుతూ ఎవరికి వారే ఇది మన పనిగా భావించి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఎవరో వచ్చి చేస్తారని వేచి చూసే కంటే దోమలు వ్యాప్తి చెందకుండా శుభ్రం చేసుకుంటే మంచిదన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ప్రస్తుతం దోమల వ్యాప్తి కారణంగా చాలా గ్రామాల్లో డెంగ్యూ, జ్వరాలు చోటుచేసుకుంటున్నాయని అప్రమత్తంగా ఉండాలని కోరారు.